క్లుప్తంగా

వైభవంగా సాయిబాబా రథోత్సవం

పెదగంట్యాడ: సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతి ధామం 9వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బాబా వారిని పల్లకీలో ఆసీనులను చేసి, రథోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆధునీకరణ పనులపై క్షేత్ర పరిశీలన



జంక్షన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి పాతగాజువాక జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఆధునీకరణ పనులు చేపట్టడానికి సంబంధిత అధికారులు సమీక్ష నిర్వహించారు. జీవీఎంసీ, ఎన్‌హెచ్ఏఐ, ఆర్ అండ్ బీ, ఏపీఎస్ఆర్‌టీసీ, ట్రాన్స్‌పోర్టు, గీతం, సివిల్ ఇంజినీరింగ్, గాజువాక ట్రాఫిక్ పోలీస్ విభాగాల అధికారులు జంక్షన్‌లో ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి సూచనలు, సలహాలను ఇచ్చారు.

బీజేపీపై ఉద్దేశపూర్వకంగానే విపక్షాల దుష్ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న మాధవ్

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో ప్రతిపక్ష పార్టీలు బీజేపీపై ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం చేస్తున్నాయని బీజేపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్ అన్నారు. గాజువాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కును రక్షించేది తామేనని, కొన్ని కార్మిక సంఘాలు ఉద్యమం పేరుతో కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్సీగా ఉన్నంత కాలం అనేక సమస్యలను కౌన్సిల్‌లో చర్చించానని చెప్పారు. ఉత్తరాంధ్రపై పూర్తి అవగాహన ఉన్న తనను మరోసారి ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో బీజేపీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, సెయిల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు, నాయకులు నిర్మల కిశోర్, దీనంకొండ కృష్ణంరాజు, కోడూరు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు ఈకార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం ఘనంగా చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

డీఈవో సందర్శన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు మాధ్యమం పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ట్యాబ్స్ వినియోగం, జగనన్న విద్య కానుక కిట్స్ నిర్వహణ, నోట్‌బుక్స్ కరక్షన్, పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న తీరు, తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు డీఈవో స్వయంగా మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అప్పలనాయుడు, ఏఎల్ఎస్‌సీవో వి.శైలజ, ప్రధానోపాధ్యాయిని కె.సలోమి, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం.. నూకాంబిక

- అనకాపల్లి రీతిలో ఆలయ నిర్మాణం
- ఉత్తరాంధ్రలో రెండో అతి పెద్ద విగ్రహం
- కొత్త అమావాస్య ఉత్సవాలకు సిద్ధం





విద్యుత్ కాంతుల్లో నూకాంబిక ఆలయం (ఇన్‌సెట్) నూకాంబిక అమ్మవారు

పెదగంట్యాడ: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా.. భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటోంది నూకాంబికా దేవి. అనకాపల్లిలోని నూకాలమ్మ ఆలయం మాదిరిగానే, చిన నడుపూరులోని ఆలయాన్ని తీర్చిదిద్దారు. అక్కడి విగ్రహం కన్నా నాలుగు అంగుళాలు మాత్రమే తక్కువ గల ఈ అమ్మవారి విగ్రహం ఉత్తరాంధ్రలోనే రెండో అతిపెద్ద విగ్రహమని స్థానికులు చెబుతున్నారు.

1980లో ప్రతిష్ఠాపన..

చిన నడుపూరు గ్రామ ప్రజలు ఇలవేల్పుగా అమ్మవారిని కొలుస్తున్నారు. గ్రామస్తుల సహకారంతో 1980లో అప్పటి ఎమ్మెల్యే గుడివాడ గురునాథరావు చేతుల మీదుగా ఇక్కడ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పట్లో చిన్న ఆలయాన్ని నిర్మించి నిత్యం పూజలు చేసేవారు. తర్వాత కాలంలో దాతల సహకారంతో ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. పెద్ద గోపురం నిర్మించి, రంగులద్దారు. ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మించి, ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఇక్కడికి వచ్చిన భక్తులకు ఆహ్లాదకర అనుభూతి కలిగేలా మాతృశ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో రావిచెట్టు, వేపచెట్టు సన్నిధిలో నాగబంధం ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రతి మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. చిన నడుపూరు గ్రామస్తుల ఆర్థిక సహకారంతో ఆలయ నిర్వహణ చేపడుతున్నారు.



ఆలయ ప్రాంగణం

ప్రత్యేక పూజలు ఇలా..

ప్రతీ అమావాస్య, పౌర్ణమి రోజుల్లో అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం 6 గంటలకు విశేష అలంకరణ చేసి పంచామృతాభిషేకాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. సాయంత్రం 7 గంటలకు నక్షత్ర హారతి ఇస్తారు. ప్రతీ శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకూ భక్తుల స్వహస్తాలతో క్షీరాభిషేకం చేయిస్తుంటారు. గతంలో ఈ ఆలయంలో ప్రతి మంగళవారం హోమాలు చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేవారు. అయితే ఆదాయం అంతంతమాత్రంగానే ఉండడంతో అన్నదాన కార్యక్రమాన్ని నిలిపేశారు.

కొత్త అమావాస్య సందడి ప్రారంభం

ఏటా ఉగాదిని పురస్కరించుకుని, కొత్త అమావాస్య రోజున అనకాపల్లిలో జరిగే విధంగా ఇక్కడ కూడా పెద్ద ఎత్తున ఉత్సవాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

మూడు రోజుల పాటు ఉత్సవాలతో పాటు అమ్మవారికి విశేష పూజలు చేస్తుంటారు. ఈ ఏడాది కూడా ఈ నెల 20 నుంచి 22 వరకు ఉగాది సంబరాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు.

దాతలు సహకరిస్తే మరింత అభివృద్ధి



అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఇక్కడ నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలు ఉంటాయి. గ్రామస్తుల సహకారంతోనే ఆలయ నిర్వహణ జరుగుతోంది. భక్తులకు మరిన్ని సదుపాయాలు కల్పించాలని చూస్తున్నాం. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో అన్నదానం కూడా జరిగేది. దాతలు సహకరిస్తే మళ్లీ ప్రారంభిస్తాం.

– ఇందల ఈశ్వరరావు, అధ్యక్షుడు, మాతృశ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ కమిటీ

కలవరపెడుతున్న జంతువుల మృత కళేబరాలు

దుర్గంధంతో అవస్థలు

పెదగంట్యాడ: మృత కళేబరాలు కలవరపెడుతున్నాయి. రోడ్డు పక్కన తుప్పల్లో, గెడ్డల్లో జంతువుల మృత కళేబరాలను చూసి స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ బీసీ గేటుకు వెళ్లే ప్రధాన రహదారి వంతెన పక్కన ఆనుకొని ఉన్న గెడ్డలతో పాటు తుప్పల్లో కుక్కలు, పందుల మృత కళేబరాలు పడి ఉంటున్నాయి. అయితే, అవి ఎక్కడో చనిపోతే, ఇక్కడకు తీసుకువచ్చి పడేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. చాలా రోజులుగా వీటిని తొలగించడం లేదని డీవీఆర్ యూనియన్ నాయకుడు డీవీ రమణారెడ్డి తెలిపారు. నిత్యం ఈ రహదారిలో వేలాది మంది స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారని, ఈ రోడ్డులోకి వచ్చేసరికి భరించలేనంత దుర్వాసన రావడంతో ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి పరిస్థితిపై అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మృత కళేబరాలను తొలగించాలని కోరుతున్నారు. దీనిపై ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా సమస్య తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. చర్యలు చేపడుతున్నామని చెప్పారు.



స్టీల్‌ప్లాంట్ బీసీ గేటుకు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన తుప్పల్లో పడి ఉన్న మృత కళేబరాలు



స్టీల్‌ప్లాంట్ బీసీ గేటుకు వెళ్లే మార్గంలో గెడ్డలో మృత కళేబరాలు

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరం



సత్తెమ్మతల్లికి కొబ్బరికాయలు కొడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



87వ వార్డులో ఓటర్లకు కరపత్రాలను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు



ఓటర్లకు కరపత్రాలను అందిస్తున్న నాయకులు

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ 65వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో కొత్తగాజువాక రాజీవ్‌మార్గ్‌లోని సత్తెమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అమ్మవారికి పూజలు చేశారు. నాగిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పాలన సుధాకర్ విజయానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ధర్మాల శ్రీను, లోకనాథం, పెద్దింటి మంగునాయుడు, జుత్తు లక్ష్మి, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కళింగవీధి సచివాలయం పరిధిలో ప్రచారం చేశారు. గవరవీధి, బొట్టవానిపాలెం, తైనాల దొడ్డి, పద్మశాలివీధి తదితర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను కలిసి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ కరపత్రాలను అందజేశారు. ప్రగడ వేణుబాబు ఆధ్వర్యంలో వడ్లపూడి కణితికాలనీ, దుగ్గపువానిపాలెం తదితర ప్రాంతాల్లో ఓటర్లను కలిసి కరపత్రాలను అందజేశారు.



స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు రోడ్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

- సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా 86వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు. భరత్‌నగర్–1 సచివాలయం పరిధిలోని కూర్మన్నపాలెం, శాతవాహన నగర్ తదితర ప్రాంతాల్లో ఓటర్లను కలిసి, కరప్రతాలను అందించారు. వెలుగులు పరశురాముడు, రామచంద్రరాజు, శ్రీనివాస పట్నాయక్, మాటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

72వ వార్డులో..

గాజువాక: సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలపించాలని కోరుతూ 72వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. ఆ పార్టీ వార్డు ఇన్‌ఛార్జి సిరట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆఫీషియల్ కాలనీలోని గ్రాడ్యుయేట్ ఓటర్ల ఇళ్లకు వెళ్లి సుధాకర్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. ఓటు వేసే విధానాన్ని ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, వాసవి నాయుడు, భవాని, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: 69వ వార్డు తుంగ్లాంలో వార్డు అధ్యక్షుడు, ఏపీ అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు విరోతి రాము, బోగాది అప్పారావు, టి.ఎల్.నర్సింగరావు, నారిపల్లి బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ గేటు రోడ్డులో ఎమ్మెల్యే ప్రచారం

పెదగంట్యాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే నాగిరెడ్డి కోరారు. స్టీల్ వైఎస్సార్ టీయూసీ నాయకుడు వై.మస్తానప్ప, ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు రోడ్డులో శుక్రవారం జోరుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, గొందేశి మహేశ్వరరెడ్డి, మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, వెంపాడ అప్పారావు, గొందేశి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- 75వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దుర్గవానిపాలెం, సీతానగరం, అయ్యన్నపాలెం, గొడ్డువానిపాలెంలో జోరుగా ప్రచారం చేశారు
- 76వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని గాంధీనగర్, గోపాల్‌రెడ్డినగర్‌లో ప్రచారం చేశారు.

పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ భెల్‌లో ప్రచారం చేశారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పి.వి.ఎస్.రాజు ఆధ్వర్యంలో ఆయా యూనియన్ల ప్రతినిధులు శుక్రవారం సంస్థలో ప్రచారం నిర్వహించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

అక్కిరెడ్డిపాలెం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వాసవ్య మహిళా మండలికి చెందిన కుషల్ మెటర్నల్ ప్రాజెక్ట్స్ అధికారి టి.శ్రావణి అన్నారు. పౌష్టికాహార ఉత్సవాల్లో భాగంగా 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో చిరుధాన్యాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కుషల్ మెటర్నల్ ప్రాజెక్ట్స్ ప్రతినిధులు రాగితో తయారు చేసిన లడ్డు, రాగి జావలను గర్భిణులకు, బాలింతలకు, కౌమారదశలో ఉన్న బాలికలకు, వృద్ధులకు అందజేశారు. గర్భిణులు వెయ్యి రోజుల పాటు తీసుకోవలసిన ఆరోగ్య జాగ్రత్తలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రుక్సానా బేగం వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ప్రాజెక్ట్ కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు సుశీల, భవానీ, అంగన్‌వాడీ టీచర్లు దుర్గాబాయి, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వంలో చలనం రాకపోవడం దురదృష్టకరం



757వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న ఉక్కు కార్మికులు

కూర్మన్నపాలెం : ఉక్కు ఉద్యమాన్ని 750 రోజులకు పైగా నిరవధికంగా కొనసాగిస్తున్నా కేంద్ర ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేకపోవడం దురదృష్టకరమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 757వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చున్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుందని, కార్మికుల జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలే దేశానికి ఆయువుపట్టని, అటువంటి సంస్థలపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

14న పైడిమాంబ జాతర



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి, గురుమూర్తి రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరు గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఈ నెల 14న నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్లు ములగపాక అచ్చింనాయుడు, మంత్రి శంకరనారాయణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గుర్తుమూర్తిరెడ్డి, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 14 వరకు రోజూ అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు చేయనున్నామని తెలిపారు.

నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనలు

జాతర సందర్భంగా ఈ నెల 11న శ్రీకృష్ణ రాయబారం, సత్యహరిశ్చంద్ర నాటకాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 12న పిట్టలదొర అనే హాస్యవల్లరి కార్యక్రమం ఉంటుందన్నారు. 13న సినీ డూప్స్, బుర్రకథ, రేలారే రేలా తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేశామని వివరించారు. 14న అమ్మవారి అనుపు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అలాగే ఆ రోజు అమ్మవారి తీర్థ మహోత్సవం ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ విద్యకు ఆద్యురాలు సావిత్రి బాయి



సావిత్రి బాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు

- ఆమె సేవలు చిరస్మరణీయం
- ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: దేశంలో స్త్రీ విద్యకు ఆద్యురాలైన సావిత్రిబాయి పూలే సేవలు మరువలేమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని టీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మంత్రి రాజశేఖర్, మార్టుపూడి పరదేశి, రాజాన వెంకట్రావు, గంట్యాడ గురుమూర్తి, ఎన్నేటి రమణ, సంపంగి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ విద్యకు ఆమె చేసిన సేవలు ఎనలేనివి

కూర్మన్నపాలెం: భారతీయ ప్రప్రథమ ఉపాధ్యాయినిగా, రచయిత్రిగా సావిత్రిబాయి పూలే ప్రసిద్ధి చెందారని స్టీల్‌ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వర్క్స్ డి.వసంతరావు అన్నారు. స్త్రీ విద్య కోసం ఆమె చేసిన సేవలు ఎనలేనివన్నారు. కూర్మన్నపాలెం ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వుడానగర్ ఫేస్–1 నందు సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సావిత్రిబాయి వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. నందికోళ్ల అప్పారావు, బలిరెడ్డి నాగేశ్వరరావు, బాబాసాహెబ్, బంగారి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐఎస్ఎఫ్ రైజింగ్ డే వేడుకలు



సీఐఎస్ఎఫ్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ భట్

కూర్మన్నపాలెం: పరిశ్రమ భద్రతలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) సేవలు విశిష్టమైనవని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ అన్నారు. సీఐఎస్ఎఫ్ రైజింగ్ డే సందర్భంగా సీఐఎస్ఎఫ్ కాంప్లెక్స్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఐఎస్ఎఫ్ సిబ్బంది భద్రత పరిశ్రమలకు చాలా ముఖ్యమన్నారు. ధైర్య, సాహసాలతో విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ అగ్నిమాపక సిబ్బంది సేవల గురించి ఎంత చెప్పినా తక్కువేనని, సంస్థలో ఎక్కడ చిన్న ప్రమాదం జరిగినా తక్షణమే వెళ్లి ప్రమాద తీవ్రతను తగ్గిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అక్తర్ మహ్మద్ హనీఫ్, అసిస్టెంట్ కమాండెంట్, అధికారులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ విశ్రాంత ఉద్యోగికి డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఏయూ న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థి బయ్యే లక్ష్మణరావుకు డాక్టరేట్ లభించింది. విభాగ విశ్రాంత ఆచార్యుడు డి.సూర్య ప్రకాశరావు పర్యవేక్షణలో 'విమెన్ అగ్రికల్చరల్ లేబర్–పాలసీ పర్‌స్పెక్టివ్స్–ఏ సోషియో లీగల్ స్టడీ ఇన్ సెలెక్టెడ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్'అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వరించింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను లక్ష్మణరావు స్వీకరించారు. ఓఎన్‌జీసీలో జనరల్ మేనేజర్‌గా పని చేసి పదవీ విరమణ చేసిన లక్ష్మణరావు ఉన్నత విద్యపై ఆసక్తితో డాక్టరేట్ పూర్తి చేశారు.



ఉత్తర్వులు స్వీకరిస్తున్న లక్ష్మణరావు

కడుపునొప్పి తాళలేక యువకుడు ఆత్మహత్య



ప్రసాద్ మృతదేహం

కూర్మన్నపాలెం(గాజువాక): అగనంపూడి తలారివానిపాలెం ప్రాంతానికి చెందిన ముద్దు ప్రసాద్(21) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తలారివానిపాలెం ప్రాంతానికి చెందిన ముద్దు ప్రసాద్ డిగ్రీ చదువుతున్నాడు. మృతుడి తండ్రి కనక అప్పారావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం ప్రసాద్‌కు కాలేయానికి సంబంధించిన శస్త్ర జరిగింది. ఈ ఏడాది జనవరిలో అప్పారావుకు హార్ట్ ఆపరేషన్ అయింది. తండ్రి కూడా అనారోగ్యానికి గురవ్వడంతో ప్రసాద్ సరిగ్గా తిండి తినక, మందులు వాడకపోవడంతో తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. దీంతో ప్రసాద్ తరచూ తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ వడ్లపూడిలోని ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఇది ఇలా ఉండగా గురువారం రాత్రి తండ్రి అప్పారావు నరవలోని ఓ పెళ్లికి హాజరవ్వగా, మృతుడి తల్లి, చెల్లి ఎస్.కోటలోని మరో పెళ్లికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రసాద్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.